# "ఫోర్ ఏంగిల్స్ ఆఫ్ ఎ ట్రయాంగిల్"

కంప్యూటర్ టెర్మినల్ ముందర కూర్చుని, ప్రో ఇంజనీర్ సాఫ్ట్‌వేర్‌తో, ఫైల్ సర్వర్ డిజైనర్‌కి సంభంధించిన స్టైస్ ఎనాలిసిస్ చేస్తున్నాను.

అప్పుడే వచ్చాడు జఫ్ పియర్స్.

"ఏయ్ సత్యం - నేనూ వర్గీస్ లంచ్‌కి వెడుతున్నాం - తాజ్ పాలస్ ఇండియన్ రెష్టారెంటుకి - వస్తావా?" అన్నాడు.

"నీకు ఇండియన్ రెష్టారెంటు మీద మోజు వుందని, నాకింతవరకూ తెలీదే.." అన్నాను నవ్వుతూ.

"లేదనుకో ... బట్ ఐ జస్ట్ వాంటెడ్ టు ట్రై" అన్నాడు జఫ్ కూడా నవ్వుతూ.

"అయితే పద" లేచాను కుర్చీలోనుంచి.

వర్గీస్ అన్నాడు, "నా కారులో పోదాం పదండి" అని

టెక్సాస్ హైవే 290 మీద వెడుతున్నప్పుడు అన్నాడు జఫ్ - 'నీకు ఎన్నోసార్లు చెప్పాను

- క్రిష్టియానిటీ మానవ జాతికి ఎంత అవసరమో - ప్రజల్నందర్నీ ఒక్క తాటి మీద నడిపించటానికి అదొక్కటే మార్గం. అయినా నువ్వు ఏమాత్రం ఉత్సాహం చూపించటంలేదు!'

జఫ్ ఆ టాపిక్ ఎప్పుడూ వదలడు. నాలుగు నెలల క్రితం అనుకుంటాను మొదలు పెట్టాడు - నన్ను క్రిష్టియన్‌గా మార్చటానికి ప్రయత్నం. నేను మాత్రం అతన్ని ఏ మాత్రం ముందుకు పోనియ్యలేదు. ఆ టాపిక్ కూడా మళ్లీ తీసుకురాకుండా చేశాను. అయినా మంచి సమయం కోసం ఎప్పుడూ అతను ఎదురు చూస్తూనేవుంటాడు.

"జఫ్! నీకు చాలసార్లు చెప్పాను. మతం గురించి, నన్ను క్రిష్టియన్‌గా కన్వర్ట్ చేయటం గురించి అసలు మాట్లాడవద్దని. నువ్వు మంచి ఫ్రెండువి కనుక ఊరుకుంటున్నాను - ఇంకొకళ్లయితేనా .."

"ఇంకొకళ్లయితే?" నవ్వుతూ అడిగాడు జఫ్.

నేనూ నవ్వుతూనే అన్నాను ... "చంపేస్తాను. అయినా ప్రపంచంలో ప్రజలందరూ ఒక్క తాటి మీద నడవటం కష్టం. నడవనవసరం లేదు కూడాను. అయినా మనుష్యులను దగ్గరకు చేసేది మతం కాదు - సంస్కృతి - కల్చర్ - ఇంకా పై పరిధిల్లోకి వెడితే, మానవత్వం."

"నేను ఒప్పుకోను - మతం మనుష్యులను కలుపుతుంది - ప్రపంచంలో అందరూ ఒకే మతం - క్రిష్టియానిటీకి - చెందితే ప్రపంచంలో ఏ కల్లోలాలూ వుండవు!"

వర్గీస్ కారు "తాజ్ పాలస్" ముందర ఆపాడు. ఆ రెస్టారెంటు చాల బిజీగా వుంటుంది లంచ్ టైమ్‌లో. చాలమంది అమెరికన్సూ, కొంతమంది ఓరియంటల్స్ - కొద్దిమంది ఇండియన్స్‌తో కిటకిటలాడుతున్నది.

లోపల కూర్చుని, ఫుడ్ ఆర్డర్ చేశాక జఫ్‌తో అన్నాను - "జఫ్ - ఈ టాపిక్‌కి ఇవాళతో ఫుల్‌స్టాప్ పెట్టేద్దాం. నేను అంతగా మతం మీద ఉత్సాహం వున్నవాణ్ణికాదు. నా వుద్దేశ్యంలో మతం, విషం లాంటిది. తగు మాత్రంలో తీసుకుంటే మందులా పనిచేస్తుంది. మోతాదు పెంచితే, ప్రాణాలు తీస్తుంది. అంతేకాక తమ మతం పేరుతో, మిగతా మనుష్యుల్ని కించపరిచేవాళ్లంటే నాకు కొంచెం అసహ్యం కూడాను - మనందరి మతం, మానవ మతం. కాకపోతే ఇందాక అన్నావే, మతం దృష్ట్యా మనుషులు దగ్గరవుతారు కానీ, సంస్కృతి వల్ల కాదని ... అది తప్పు అని నిరూపిస్తాను."

"ఎలా?" అడిగాడు జఫ్ నన్ను రెచ్చగొడుతూ.

వర్గీస్ మాత్రం - పరోటాని శెనగల కూరతో తింటూ, మా మాటలు వింటూ కూడా, విననట్టుగా కూర్చున్నాడు.

"ఈ టేబుల్ దగ్గర మనం ముగ్గురం కూర్చున్నాం ఒక త్రికోణంలాగా. మన ముగ్గురిలోనూ నాలుగు రకాల వైవిధ్యాలు వున్నాయి. రెండు మతాలు - రెండు సంస్కృతులూ - నేనూ వర్గీస్ ఇండియా నుంచి వచ్చాం - ఇద్దరిదీ భారతీయ సంస్కృతి. కానీ మా మతాలు

వేరు. వర్గీస్ క్రిష్టియన్ - నేను హిందూని - మా మతాలు వేరు - ''

''అందుకే చెబుతున్నాను - నువ్వూ మారిపో!'' నవ్వాడు జఫ్.

స్నేహపూర్వకంగానే అన్నాను - ''షటప్ జఫ్ - డోంట్ ట్రై టూ హార్డ్! ఓకే - ఏం చెబుతున్నాను - అదే నా గురించీ, వర్గీస్ గురించీ - ఇప్పుడు నిన్నూ, వర్గీస్‌నీ తీసుకుందాం - నువ్వు అమెరికన్‌వి, వర్గీస్ ఇండియన్ - మీ ఇద్దరి సంస్కృతులు వేరు. అయినా మీ ఇద్దరూ క్రిష్టియన్ మతానికి చెందినవాళ్లు!''

వర్గీస్ వెజిటబుల్ పలావ్ మీద రైతా వేసుకుని, చకచకా తింటున్నాడు. మంచి ఆకలి మీద వున్నట్టున్నాడు.

జఫ్‌కి ఆ ఆహార పదార్థాలు బాగా కారంగా వున్నట్టున్నాయి. ఐస్ టీ తెగ తాగుతూ, నెమ్మదిగా అంటున్నాడు.

''మన ముగ్గుర్నీ ఒకళ్లతో ఒకళ్లని పోల్చుకుందాం. నువ్వు తెల్లవాడివి. నేనూ వర్గీస్ బ్రౌన్‌గా వున్నాం. నీ ఇంగ్లీష్ అమెరికన్ ఏక్సెంట్‌తో వుంటుంది. వర్గీస్, నేనూ ఎంత ప్రయత్నించినా మా ఇండియన్ ఏక్సెంటును వదలలేకపోతున్నాం. నువ్వు ఈ భోజనం తినటానికి ఇబ్బంది పడుతున్నావ్. నేనూ, వర్గీస్ దాదాపు తినటం పూర్తిచేసి, మళ్లీ ఆర్డర్ చేయటానికి సిద్ధంగా వున్నాం. ఇండియా డే ఫంక్షన్‌కి మా అమ్మాయి పాట పాడుతుంటే, వర్గీస్ కీబోర్డు వాయించాడు. ఆరోజు కల్చరల్ ప్రోగ్రాం మేం ఇద్దరం కలిసే నిర్వహించాం. మా ఇద్దరి మధ్య వున్నంత సామరస్యం, జీవిత సరళి, మీ ఇద్దరి మధ్య లేవు. ఎందుకని? మా ఇద్దరిదీ ఒకే సంస్కృతి. భారతీయ సంస్కృతి. మాకు అమెరికన్ సంస్కృతి మీదా, నీకు భారతీయ సంస్కృతి మీదా సద్భావం, ఉత్సాహం వుండవచ్చు. కానీ ఈ సంస్కృతులను జీర్ణం చేసుకొనటానికి చాల సమయం పడుతుంది. ఇక్కడ మత ప్రమేయం లేదు. మా దేశంలో దీపావళికి, అన్ని మతాల వాళ్లు టపాకాయలు కాలుస్తారు. అది సంస్కృతిలో ఒక భాగం అయిపోయింది. అలాగే యిక్కడ మేము క్రిష్టమస్ చెట్టు ఇంట్లో అలంకరించటం, పండగ చేసుకోవటం అమెరికన్ సంస్కృతి పరంగానే కాని మత ప్రమేయంతో కాదు. మతం, దేశ సంస్కృతిలో ఒక భాగం మాత్రమే! - మనుష్యుల్ని దగ్గరకు చేసేది - సంస్కృతి - ఇంకా పై పరిధిల్లోకి వెడితే మానవత్వం!''

జఫ్ ఒక క్షణం ఆలోచించాడు - 'వర్గీస్ - సత్యం చెప్పినదానికి నువ్వు అంగీకరిస్తావా?' అడిగాడు.

''అతను వున్నమాట చెప్పాడు - ఒప్పుకోక తప్పదు. చర్చిలో కూడా, అమెరికన్ చర్చిలో జరిగే ప్రార్థనలకూ, ఇండియన్ చర్చిలో జరిగే పూజలకూ చాల వ్యత్యాసం వుంది. మా చర్చిలో పూజల్లో చాల భారతీయత కనిపిస్తుంది!'' అన్నాడు వర్గీస్ లేస్తూ.

''అయితే - పదండి - పోదాం'' అన్నాడు జఫ్ కూడా లేస్తూ.

లంచ్ టైము అయిపోయిందని, ఒంటి గంట చూపిస్తున్నది రిస్ట్‌వాచ్.